ప్రజాశక్తి

ఆదివారం 3 డిసెంబర్ 2023

కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల

బదిలీలకు ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీ, అటాచ్‌మెంట్‌కు సంబంధించి శనివారం సాయంత్రం శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 17 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 24 మంది కానిస్టేబుళ్లను వివిధ పోలీస్ స్టేషన్‌లకు అటాచ్‌మెంట్ చేశారు. అలాగే 14 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల అభీష్టం మేరకు వారు కోరిన ప్రదేశాలకు బదిలీ చేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

విగ్రహాల వివాదం

◆ మత విద్వేషాగ్ని రగిల్చేందుకు కొందరి యత్నం

◆ అనంతలో 'టిప్పుసుల్తాన్' చుట్టూ మత రాజకీయాలు

◆ కదిరిలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటులోనూ వివాదం

విగ్రహాల చుట్టూ వివాదాన్ని రాజే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అటు కదిరి, ఇటు అనంతపురం నగరంలో రెండు చోట్లా విగ్రహాల ఏర్పాటు వివాదానికి దారితీస్తోంది. విగ్రహాల ఏర్పాటుకు మతం రంగు పులుమేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా టిప్పుసుల్తాన్ విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు చోట్ల సమస్యాత్మకంగా మారుతోంది. కర్నాటకలోనూ గతంలో టిప్పుసుల్తాన్ అంశంపై పెద్దఎత్తున వివాదాలు చెలరేగాయి. ఇప్పుడు అనంతపురం జిల్లాకు విస్తరించే ప్రయత్నాలు ముమ్మరమైనట్టు కనిపిస్తున్నాయి. విగ్రహం ఏర్పాటు చేసి తీరుతామని కొంత మంది... పగులగొడతామంటూ మరికొంత మంది.. చేస్తున్న ప్రకటనలు వివాదాలకు ఆజ్యం పోసే విధంగా ఉన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో 20 శాతానికిపైగా ముస్లిం జనాభా ఉన్నా ఎప్పుడూ మతపరమైన ఇబ్బందులు తలెత్తిన దాఖలాల్లేవు. మత సామరస్యానికి ప్రతీకగా అనంతపురం నగరంలో ఉంటుంది. గుడి, మసీదులు పక్కపక్కనే ఉన్నా కలసిమెలసి పోతుండటం ఇక్కడి ప్రత్యేకత. ఇటువంటి చోట విగ్రహం ఏర్పాటుపై స్థానికంగా అందరూ కలసి కట్టుగానే ముందుకొస్తున్న తరుణంలో బిజెపి నేతలు ఏర్పాటును అడ్డుకుంటామని ప్రకటనలు చేయడం కొంత ఆందోళనకు గురిచేస్తోంది. అదే సమయంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని కొంతమంది ఏర్పాటు చేస్తున్నారు. రెండింటినీ నగరవాసులు స్వాగతిస్తున్నారు. ఈ నేపథ్యంలో టిప్పువిగ్రహం ఏర్పాటుపై వస్తున్న వివాదానికి పుల్‌స్టాప్ పెట్టే విధంగా అందరితో కలిపి అనంతపురం నగరంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అందరి అభిప్రాయాలు, మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో ఏ మేరకు సానుకూలత వస్తుందన్నది చూడాల్సి ఉంది. అటు సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోనూ టిప్పుసుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనికి వ్యతిరేకంగానూ బిజెపి నేతలు ప్రకటనలు చేస్తున్నారు. అక్కడే శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు అంశం కూడా వివాదాస్పదమైంది. శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు అనుమతుల్లేకుండా రహదారిలో పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో కొంత మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కదిరి పట్టణం ముందు నుంచి సున్నితమైన ప్రాంతంగా ఉంది. గతంలో పలుమార్లు ఘర్షణలకు దారితీసిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. విగ్రహాల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇకపోతే విగ్రహాలు ఏర్పాటు చేయడానికి కొన్ని విధి విధానాలున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల అనుమతులు తప్పనిసరిగ ఉండాలి. అదే విధంగా జిల్లా కలెక్టర్ అనుమతులూ తీసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ పూర్తయితేనే విగ్రహాలు ఏర్పాటు సాధ్యమవుతుంది. పైరెండు చోట్ల కూడా ఏ మేరకు అనుమతులు తీసుకున్నారన్న చర్చ కూడా నడుస్తోంది. అధికారిక అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసి ఎన్నికల సమయంలో వివాదాన్ని చేయడం సరైంది కాదని మేధావులు సూచిస్తున్నారు.

పేరుకే 'ప్రజావేదిక..!'

◆ తూతూమంత్రంగా సామాజిక తనిఖీ ◆ మమా అనిపించిన అధికారులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఉపాధి హామీ పనులపై ప్రతి ఏడాది సామాజిక తనిఖీ అనంతరం నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదికను చిలమత్తూరులో అధికారులు మమా అనిపించారు. ప్రజా వేదికను ప్రజలతో నిర్వహించాల్సి ఉండగా కేవలం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించి మమా అన్పించారు. ఎలాంటి చర్చ లేకుండానే మధ్యాహ్నం 12:40గం॥కు ముగించేశారు. ఈ కార్యక్రమ నిర్వహణపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కనీసం ముందస్తు పత్రికా ప్రకటన ఇవ్వకుండానే హఠాత్తుగా శనివారం నాడు సామాజిక తనిఖీ ప్రజావేదికను స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు నిర్వహించారు. సామాజిక తనిఖీ గ్రామసభలు ప్రతి పంచాయతీ పరిధిలో నిర్వహణ కూడా నామమాత్రంగా నిర్వహించినట్లు తెలుస్తుంది. ప్రతి శనివారం చిలమత్తూరులో వారపు సంత జరుగుతుంది. ఇక్కడికి వచ్చిన ప్రజలను సమావేశంలో కూర్చొబెట్టి కార్యక్రమాన్ని మమా అనిపిద్దామని అధికారులు అనుకున్నారు. తుఫాన్ కారణంగా వాతావరణం ప్రతికూలించడంతో ప్రజలు పెద్దగా మార్కెట్‌కు రాలేదు. దీంతో జనం కన్పించేందుకు సచివాలయ సిబ్బంది, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను సమావేశంలో కూర్చొబెట్టారు.

మొక్కలు లేకుండానే లెక్కలు నొక్కేశారు...

చిలమత్తూరు మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ప్రభుత్వం ఎన్ఆర్జీఎస్ ద్వారా పండ్లతోటలు పెంపకం కోసం తీసుకొచ్చిన పథకంలో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో బట్టబయలు అయ్యింది. సామాజిక తనిఖీ బృందం తనిఖీ సమయంలో అక్కడ అసలు మొక్కలే లేవని రైతులు వేరే పంటలు సాగుచేసుకున్నారని స్పష్టం చేశారు. మూడేళ్ల పాటు బిల్లు చెల్లించారని చెప్పుకొచ్చారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన తనిఖీ కావడంతో బిల్లులు చేసే సమయంలో మొక్కలు ఉన్నాయని తర్వాత ఎండిపోయాయని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్‌లు కవర్ చేసుకున్నారు. తనిఖీ ఏప్రిల్, మే నెలల్లో జరిగితే అనేక అవకతవకలు బయటకు వచ్చేవి. ఆలస్యం కావడంతో అవినీతికి కలిసొచ్చినట్లు తెలుస్తుంది. చాలా వరకు ఫారం పండ్లు వర్షాలు ఎక్కువ రావాడంతో పూడిపోయినట్లు సమాధానం చెప్పుకొచ్చారని తనిఖీ బందం చెప్పుకొచ్చారు. ఇలా చూస్తే తనిఖీనే కాదు పనులు నామమాత్రంగానే జరిగినట్లు స్పష్టం అయ్యింది. కూలీలకు రోజుకూలీ 272 రూపాయలు చెల్లించాల్సిండగా ఎవరికీ పూర్తిస్థాయిలో చెల్లించలేదని సాక్ష్యాత్తూ పీడీ విజయప్రసాద్ మండిపడ్డారు. చాలా మందికి 100 రోజులు కూడా పూర్తి చేయించలేదని అన్నారు. అలా పూర్తిచేసి ఉంటే ఉన్నతిలో వారి కుటుంబికులకు ఉపాధి శిక్షణ అందేదని అన్నారు. మొత్తం మండల వ్యాప్తంగా తనిఖీల్లో భాగంగా రూ.29,657 రికవరీ చేయాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ విజయప్రసాద్, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపిడిఒ నరేష్ క్రిష్ణ పాల్గొన్నారు.

ప్రజావేదికలో కూర్చొన్న ఉపాధి సిబ్బంది,సచివాలయ ఉద్యోగులు

జాతీయ రహదారి పనులను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకూ చేపట్టిన జాతీయ రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని చిత్రావతి నదిపై నిర్మిస్తున్న ఓవర్ బ్రిడ్జి పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించి పనులు జరుగతున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. చిత్రావతి నది ప్రవాహంపై చర్చించారు. నదిలో నీరు నిల్వ ఉండేందుకు రోడ్డు తీసేసిన తర్వాత వచ్చిన తారుతో అడ్డుగా వేయాలని సూచించారు. అప్పరాచెరువులో నీటి నిల్వ గురించి ఆరా తీశారు. చెరువులో చేపల కోసం మత్స్యకారుల కోరిక మేరకు నీరు వదిలినట్లు తెలిపారు. అనంతరం సంగమేశ్వర క్షేత్రంలో నిర్మించిన రోడ్డు కమ్ బ్రిడ్జి వద్దకు చేరుకుని నదిలో నీటి నిల్వను పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో వర్షాలు ఉన్నందును నీరు నిడుదల చేయాలని ఆదేశించారు. దీంతో కొడేకండ్ల గ్రామానికి చెందిన నాయకుడు బండి వీరనారప్ప గేటు ఎత్తి ఉప్పర్లపల్లి చెరువుకు నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే వెంట బగ్గిరి బయపురెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కాళప్ప, బండి వీరనారప్ప, బండి నాగభూషణ, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ అన్నారు. శనివారం ఓటర్ల అవగాహన కార్యక్రమం సందర్భంగా స్వీప్ యాక్టివిటీ ర్యాలీను జేసీ చేతన్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గుండా ఆర్టీసీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపెయిన్ డేలను శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద జరుపుకుంటున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. నూతన ఓటరుగా నమోదుకు ఫారం-6, మరణించిన వారి వివరాలను ఓటర్ జాబితా నుండి డెత్ సర్టిఫికేట్ అప్లోడ్ చేసి మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు తొలగింపునకు ఫారం-7, ఓటరు కార్డులో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరుగా ఎక్కడ నమోదైయ్యామో అనే సమచారానికి ఓటర్ హెల్ప్ లైన్ యాప్ లేదా ఎన్వీఎస్పీ వెబ్ సైట్ లేదా 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి కానీ తెలుసుకోవచ్చునని తెలిపారు. ఓటరు క్యాంపెనింగ్ డేలో ఆయా పోలింగ్ స్టేషన్‌లో బిఎల్ఓలు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 58, 59, 60, 63, 74, 75 పోలింగ్ స్టేషన్లలను పరిశీలించి బిఎల్ఓల రిజిస్టర్‌లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎంపీడీవో నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, ఎంఇఒ గంగప్ప, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గోరంట్ల

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో 1992 నుంచి అనుభవంలో ఉన్న పేదల స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో పేదలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. పేదలు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న 20 కుటుంబాలకు తక్షణమే పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ రంగనాయకులు మండల సర్వేయర్‌ను గ్రామానికి పంపించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు వెంకటేశులు, గ్రామస్తులు రామలక్ష్మమ్మ, హబీబ్, రహంతుల్లా, రామకృష్ణమ్మ, లావణ్య, గంగరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

విగ్రహాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

◆ మంత్రి పెద్దిరెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు..

◆ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్

విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రశాంతంగా ఉన్న కదిరి ప్రాంతంలో కులం, మతం, విగ్రహాల పేరుతో విద్వేష రాజకీయాలు చేసేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చరిత్ర హీనుడిగా నిలిచిపోతారని టిడిపి కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కదిరి పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటులో వైసిపి నాయకులు ప్రజల మధ్య కక్షలు రేపే కుట్రలు చేస్తున్నారన్నారు. భూస్వామ్య పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడేతత్వం బలిజ సోదరులకు ఉంటుందన్నారు. వారు ఆరాధించే కుల బాంధవుడు శ్రీకష్ణదేవరాయల విగ్రహం కదిరి ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చారన్నారు. ఈ విషయంలో మంత్రి పెద్దిరెడ్డి ఒకలా, స్థానిక ఎమ్మెల్యే ఒకలా ప్రవర్తిస్తూ విగ్రహాల రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసే సమయంలో ఏ కారణం లేకుండా బలిజలపై క్రిమినల్ కేసులు బనాయించడం అత్యంత దుర్మార్గం అన్నారు. తలుపులలో శ్రీకష్ణదేవరాయల విగ్రహం, కదిరిలో ఎన్టీఆర్, వేమారెడ్డి, నిజాంవళి, ఇందిరాగాంధీ, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలు పెట్టినప్పుడు ఎలాంటి సమస్యలూ లేవన్నారు. అలాంటిది కదిరిలో శ్రీకష్ణదేవరాయల విగ్రహం పెట్టుకోవాలనుకుంటే బలిజలపై ఎందుకు కేసులు నమోదు చేశారో అర్థం కావడం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే కదిరి ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలి కాని ఇలా కక్షలతో కూడిన రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. కుల, మత రాజకీయాలు చేసే సంస్కృతి కదిరి ప్రాంతంలో ఎప్పుడూ లేదని, మంత్రి పెద్దిరెడ్డి అలాంటి సంస్కృతిని తెచ్చే ప్రయత్నం చేస్తుండడం సరికాదన్నారు. ఇలాంటి పద్ధతులను ఆయన మానుకోకపోతే చరిత్రహీనుడిగా నిలిచిపోతారన్నారు. క ది రి ప్రాంతాన్ని భవిష్యత్తులో టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనటువంటి ఎత్తైన శ్రీకష్ణదేవరాయల విగ్రహాన్ని కదిరి పట్టణంలో తాను ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. రాజకీయ అవసరాలు, ఎత్తుగడలకు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

'బ్యాక్ వర్డ్ క్లాసెస్ కాదు బ్యాక్ బోన్ క్లాసెస్' పుస్తకాన్ని విడుదల చేస్తున్న బికె.పార్థసారథి

బిసిల వెన్ను విరిచిన సిఎం జగన్

ప్రజాశక్తి -పెనుకొండ

సిఎం జగన్ బిసిల వెన్ను విరుస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి విమర్శించారు. పట్టణం లోని పార్టీ కార్యాల యంలో శనివారం ఆయన 'బ్యాక్ వర్డ్ క్లాసెస్ కాదు బ్యాక్ బోన్ క్లాసెస్' పుస్తకాన్ని పార్టీ నాయ కులు, కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ బిసిల గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందన్నారు. బిసిలపై జగన్ రెడ్డి, ఆయన సామంతరాజుల పెత్తనం ఏంట ని నిలదీశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయనే జగన్ బిసిల జపం మొదలుపెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య, ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ అధ్యక్షులు రవిశంకర్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, జిల్లా యాదవ సాధికార కన్వీ నర్ కేశవయ్య, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలడుగు చంద్రశేఖర్, జిల్లా కార్య నిర్వాహక కార్య దర్శి దేవానరసింహప్ప, జిల్లా అధికారప్రతినిధి రఘువీరాచౌదరి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు లక్ష్మి నారాయణరెడ్డి, రామలింగ, ఫ్యాక్షన్ శ్రీనివాస్, గుట్టూరు నాగరాజు, పోతిరెడ్డి, హనుమంతనాయక్, ఆదిశేషు, చంద్రమౌళి, శేఖర్, రాము, కిరణ్, సూర్యనారాయణ, శరత్, నారాయణ నాయక్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి:సిఐటియు

పెనుకొండ : మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ వర్కర్స్, మినీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం అంగన్వాడీ సెంటర్ల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు, ఎఫ్ఆర్‌సి రద్దు, టిఎ, ఇతర బకాయి బిల్లుల చెల్లింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు భావమ్మ, మాబున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన కార్మికుల పోరాటం

ప్రజాశక్తి-హిందూపురం

తూముకుంట పారిశ్రామిక వాడలోని గురునానక్ పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా పరిశ్రమను మూసివేసింది. దీంతో కార్మిక చట్టం ప్రకారం కార్మికులకు గ్రాట్యుటీ, నష్టపరిహారం అందించాలని తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దిగివచ్చిన పరిశ్రమ యజమాని అవతార్ సింగ్ శనివారం కార్మికులకు గ్రాట్యుటీ రూ. 6 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. నిరసన కార్యక్రమాలకు సిపిఎం, సిఐటియు, ఒపిడిఆర్, ఎంఎస్ఎఫ్, బిఎస్‌పితో ఇతర ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికి కార్మికులకు అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవాడ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు పి.బాబు, గురునానక్ కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా బిఎల్ఒలు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఆర్డీవో రమేష్ రెడ్డి ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఓటరు జాబితాలో నిర్లక్ష్యం, అశ్రద్ధ చూపకుండా ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఎక్కడా రాజకీయ ఒత్తిళ్లకు గురికావద్దన్నారు. బిఎల్ఒలపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహశీల్దార్ ఉన్నారు.

ఎమ్మెల్యే సూచనతో చెరువులకు నీరు

బత్తలపల్లి : ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సూచనల మేరకు ఓబుళాపురం సర్పంచి వీరనారప్ప సంగమేశ్వరం వద్ద ఉన్న చెక్ డ్యాం తూము గేటుని ఎత్తి నీళ్లను కింద చెరువులకు వదిలారు. చెక్ డ్యాం నుంచి జ్వాలాపురం, కోడేకండ్ల మీదుగా ఉప్పర్లపల్లి చెరువుకు నీరు వెళ్తాయని తెలిపారు. ఉప్పర్లపల్లి చెరువు నిండిన తర్వాత జలాలాపురం చెరువుకు నీరు వెళ్తాయన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో నీటిని విడుదల చేస్తున్న సర్పంచి వీరనారప్ప

అంగవైకల్యం శాపం కారాదు

వికలాంగ విద్యార్థులకు నీటి బాటిళ్లు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

అంగవైకల్యం విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు ఏమాత్రం శాపం కారాదని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంజిఎం పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో శనివారం జరిగిన జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. తల్లిదండ్రులు విభిన్న ప్రతిభావంతుల పిల్లల పట్ల ప్రేమతో వ్యవహరించడంతో పాటు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీరిలో ఖచ్చితంగా ఏదో ఒక విభిన్నమైన ప్రతిభ ఉంటుందని దానిని గుర్తించి వెలికితీయాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న దివ్యాంగులను ఆదర్శంగా తీసుకొని ఎలాంటి నిరాశకు గురికాకుండా ముందుకెళ్లాలన్నారు. భవిత కేంద్రంలో విద్యుత్ మరమ్మతులకు, విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తానని ఎపిపి ఇందాద్ తెలిపారు. అనంతరం న్యాయమూర్తి దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. న్యాయవాదుల సహకారంతో విద్యార్థులకు నీటి బాటిల్లను అందజేశారు. కార్యక్రమంలో ఎజిపి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఇఒ గంగప్ప, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, న్యాయవాదులు సుదర్శన్, నారాయణగౌడ్, సంతోషికుమారి, ఎంజిఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, భవిత కేంద్రం నిర్వాహకురాలు లలిత, లోక్ అదాలత్ శారద, ఆశా పాల్గొన్నారు

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 9వ తేదీన జరిగే మెగాలోక్‌అదాలత్‌పై సిఐలు, ఎస్ఐలు, ఎఎస్ఐలతో సమీక్షించారు. రాజీ కాదగిన క్రిమినల్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐతో పాటు పరిగి, చిలమత్తూరు, హిందూపురం వన్ టౌన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

చంద్రబాబును బొకే అందజేస్తున్న పల్లె

చంద్రబాబును కలిసిన పల్లె

పుట్టపర్తి రూరల్ : నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి శనివారం విజయవాడలో పార్టీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పుట్టపర్తి నియోజక వర్గంలో టిడిపి బలంగా ఉందని, పార్టీకి, ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని పల్లెను చంద్రబాబు అభినందించారు. ఇకపై ప్రజలతో మరింత మమేకం కావాలని చంద్రబాబు పల్లెకు సూచించారు.

రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు

బత్తలపల్లి : రానున్న రెండు, మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట చేతికొచ్చి కల్లాల్లో ఉన్న వరి పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించుకో వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ఎంపిడిఒ సాయిమనోహర్ శనివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

9 వరకు ఓటు నమోదుకు గడువు

మడకశిర : ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 9వ తేదీ వరకూ అవకాశం ఉందని బిఎల్ఒ ధర్మేంద్ర తెలిపారు. మండల పరిధిలోని జమ్మానిపల్లి గ్రామం 171బూత్‌లో శనివారం బిఎల్ఒ ఆధ్వర్యంలో బూత్ ఏజెంట్లు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ఈ ప్రక్రియను డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులు పర్యవేక్షించారు.

కనకదాసు విగ్రహ ఏర్పాటుకు విరాళం

పెనుకొండ : గోరంట్లలో ఏర్పాటు చేయనున్న కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కురుబ సంఘం అసోసియేట్ అధ్యక్షులు కురుబ కృష్ణమూర్తిని శనివారం గోరంట్ల మండల కురుబ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కష్ణమూర్తి కనకదాసు విగ్రహ ఏర్పాటుకు రూ. 25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ గిరి, సోముశేఖర్, దేవానంద, రామ్మోహన్, శంకరప్ప, నాగరాజు, వెంకటేశు కె.నాగరాజు, బి.నాగరాజు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' మహిళలకు వరం

మడకశిర : టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోలోని 'సూపర్ సిక్స్' పథకాలు మహిళలకు వరమని పట్టణ కన్వీనర్ మనోహర్ తెలిపారు. పట్టణంలోని శివాపురంలో శనివారం 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. మనోహర్ తెలుగుతమ్ముళ్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం 8వ వార్డ్ స్కూల్‌లో పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి కొత్త ఓట్లు చేర్పించుట, డెత్ డిలీటెడ్, డబుల్ ఎంట్రీ గురించి బూత్ లెవెల్ ఆఫీసర్స్‌తో చర్చించి తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓంప్రకాష్, నరేష్, శివ, మారుతి ,పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

హిందూపురం : పట్టణంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన వాల్మీకి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి శనివారం ఎపి ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ రూ. 2 లక్షలు విరాళం అందజేశారు. వాల్మీకులు కలిసి మెలిసి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నవీన్‌నిశ్చల్ వారికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణప్ప, బిఎన్.మూర్తి, సాయి, దేవరాజ్, విజయకుమార్, కొండప్ప, హనుమంతప్ప, చెన్నప్ప, కాలవ రమణ, వైసిపి నాయకులు నరసింహారెడ్డి, ఆనంద్, రామంజి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నవీన్ నిశ్చల్

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి-మడకశిర

సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ సిఐ భార్గవరెడ్డి

పట్టణంలోని మారుతీనగర్ ఎస్సీ బాలుర వసతి గృహం ఆవరణలో శనివారం మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెబ్ సిఐ భార్గవరెడ్డి, సిఐ సురేష్ బాబు, ఎస్ఐ లోకేష్ మాట్లాడుతూ డాక్టర్ల సలహా మేరకే డ్రగ్స్ ఉపయోగించాలన్నారు. కొందరు మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా తీసుకోవడం వల్ల వారి ప్రవర్తన సమాజం మీద పడి అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మరికొందరు మత్తుకు బానిసలై అనేక రకాల డ్రగ్స్ ఉపయోగించడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ మధ్యకాలంలో యువత ఎక్కువగా డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలు ఉపయోగించినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి సమాచారం తెలిస్తే తమకు తెలపాలన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర, డ్రైవర్ల, యూనియన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కోర్టు సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

ధర్మవరం కోర్టులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా జడ్జి శ్రీనివాస్ తెలిపారు. ఆయన ముందుగా పట్టణంలోని చెన్నకేశవస్వామి, దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ధర్మవరం కోర్టుకు హాజరై జడ్జిల ద్వారా కోర్టు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులతో సమావేశం నిర్వహించగా వారు సమస్యలను విన్నవించారు. ఈ నెల 9వ తేదీ నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయవాదులు, పోలీసులను కోరారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్,జూనియర్ సివిల్ జడ్జిలు గీతావాణి, రమ్యశ్రీ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాండ్లపెంట

ఇస్తేమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

జనవరి 2, 3 తేదీల్లో గాండ్లపెంటకు సమీపంలోని కదిరి జాతీయ రహదారి పక్కన ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహిస్తున్న ఇస్తేమా ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి స్థానిక అధికారులు, మైనార్టీ పెద్దలతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 18 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఇస్తేమాకు లక్ష మంది హాజరవుతారన్నారు. అందుకనుగుణంగా విద్యుత్, తాగునీరు, వైద్యం, భద్రత, తదితర ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉండాలని, ప్రత్యేకంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ హమీద్‌బాషా, ఎంపిడిఒ రామ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి ఎఇ బాషా, ఎస్ఐ వెంకటనారాయణ, వైసిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, సర్పంచి రహమతుల్లా, భాస్కర్ రెడ్డి, హైదర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వాసుపత్రి వద్ద చెత్తను చూపిస్తున్న సవితమ్మ

పట్టణంలో పారిశుధ్యం నిర్వహణలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలం అయ్యారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. ఆమె శనివారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ముందు నిల్వ వున్న చెత్తచెదారాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తచెదారం పేరుకుపోయిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రి వద్ద అపరిశుభ్రత నెలకొందన్నారు. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విడదల రజని గొప్పలు చెప్పుకుంటున్నా గ్రౌండ్ లెవల్‌లో పూర్తి వ్యతిరేకంగా ఉందన్నారు. పెనుకొండ ప్రభుత్వాసుపత్రి చుట్టూ ఉన్న చెత్తచెదారం చూస్తే ఈ విషయం అర్థం అవుతుందన్నారు. ప్రభుత్వం పేదల జీవితాలతో ఆడుకుంటుందని, స్థానిక ఎమ్మెల్యేకి గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో చెత్తచెదారం కనిపించలేదా అని ప్రశ్నించారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలోని చెత్త చెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

10న కార్తీక వనభోజనం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కరపత్రాలు విడుదల చేస్తున్న యోగా అధ్యక్షులు గాజుల సోమేశ్వర్‌రెడ్డి

ఈ నెల 10వ తేదీ ధర్మవరం చెరువు సమీపంలోని 7వ మరువ వద్ద శ్రీఆంజనేయస్వామి ఆశ్రమంలో కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు యోగా అధ్యక్షులు గాజుల సోమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ యోగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు కార్తీక వనభోజన ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ముఖ్యఅతిథులుగా సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, సోలిగార్ల వెంకటేశులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కరెంటు ఆది, తిరుమలేష్, సహకార్యదర్శి ఈశ్వరయ్య, ట్రెజరర్ కట్టా రవి, యోగా ఆర్గనైజర్ నర్సింహులు, రామన్న, లక్ష్మయ్య, వేణుగోపాల్, నాగరాజు, సుబ్బయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వాహనం ప్రారంభం

కదిరి టౌన్ : మండల పరిధిలోని పట్నం గ్రామపంచాయతీ మాచిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం వైస్ ఎంపిపి భూక్య ఆనంద్ నాయక్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మెంబర్ సుధీర్‌రెడ్డి ఇంటింటికీ బియ్యం సరఫరా చేసే ఎండియూ వాహనాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల ఆగిపోయిన ఎండియూ వాహనాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదేశాల మేరకు తిరిగి ప్రారంభించామన్నారు. మాచిరెడ్డిపల్లి, రాచవారిపల్లితండా, వీరేపల్లిపేట, ఏటిగడ్డ తండాకు నాణ్యమైన బియ్యం, నిత్యావసర సరుకులను రేషన్ కార్డుదారుల ఇళ్ల ధ్దకే చేరవేస్తాయన్నారు.

హిందీ ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన రొళ్ల గురుకుల పాఠశాల విద్యార్థులు

హిందీ ప్రవేశ పరీక్షలో రొళ్ల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-మడకశిర

ఇటీవల నిర్వహించిన దక్షిణ భారత్ హిందీ ప్రచార సభ పరీక్షల్లో రొళ్ల అంబేద్కర్ గురుకుల పాఠశాల బాలలు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ మైలారప్ప తెలిపారు. ప్రాథమిక స్థాయిలో 22 మందికి 22 మంది ప్రథమ శ్రేణిలో, మధ్యమా స్థాయిలో 60 మందికి 58 మంది ప్రథమ శ్రేణిలో, ఇద్దరూ ద్వితీయ శ్రేణిలో, రాష్ట్ర భాషలో ఆరుగురికి ఆరుగురు ప్రథమ శ్రేణిలో, ప్రవేశికలో ముగ్గురికి ముగ్గురూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు. సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు హిందీ ఉపాధ్యాయులు జయరంగప్ప, అశ్వతమ్మ, తదితరులు అభినందించారు.

సమావేశం వివరాలు వెల్లడిస్తున్న బిసి నాయకులు

నేడు బిసిల ఐక్యవేదిక సమావేశం

పుట్టపర్తి క్రైమ్ : స్థానిక సాయి ఆరామం అతిథి గృహంలో ఆదివారం(నేడు) నిర్వహిస్తున్న బిసిల ఐక్యవేదిక సమావేశాన్ని జయప్రదం చేయాలని బిసి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం బిసి నాయకులు సమావేశమై విస్తతంగా చర్చించారు. సామకోటి మాట్లాడుతూ సీనియర్ బిసి నాయకుటు కొట్టాల శ్రీరాములు అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశంలో సమస్యలపై చర్చిస్తామన్నారు. బిసిలు రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా ఎదగడానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాజకీయంగా పార్టీలు జనాభా ప్రాతిపదికన బిసిలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతేంద్ర, ఉమాపతి యాదవ్, జింకల చెన్నకేశవులు, నారాయణస్వామి, మురళి, కేసాని ఆదినారాయణ, గంగిరెడ్డిపల్లి నాగరాజు, వాల్మీకి గంగాద్రి పాల్గొన్నారు.

ఓటరు జాబితా నిష్పక్షపాతంగా తయారుచేయాలి

ధర్మవరం టౌన్ : బిఎల్ఎలు, అధికారులు నిష్పక్షపాతంగా, తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారుచేయాలని గోనుగుంట్ల అనుచరులు చిగిచెర్ల అరవిందరెడ్డి, డిష్ రాజు, తుంపర్తి పరమేష్ కోరారు. పట్టణంలోని గోనుగుంట్ల వ్యక్తిగత కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల అధికారులు ముసాయిదా ఓటరు జాబితాపై ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట వింటే జైలుకు పోతారని హెచ్చరించారు. వలస వెళ్లిన ఓటర్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ధర్మవరంలో వైసిపి రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో దుస్సా క్రిష్ణ, దస్తగిరి, గిరిధర్, నబీ రసూల్, చిలకం సూర్యనారాయణరెడ్డి, రాము, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, చెన్నారెడ్డి, మార్కెట్ రహీం, గణేశ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో రైతు మృతి

బత్తలపల్లి : పొలంలో పని చేసుకుంటున్న రైతును పాము కాటు వేయడంతో మృతి చెందిన సంఘటన శనివారం మండల పరిధిలోని రామాంజులపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రైతు చంద్రశేఖరనాయుడు(45) తన వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేశాడు. అందు లో అడవి పందులు తొక్కడంతో శనివారం సాయంత్రం పొలం చుట్టూ కట్టెలు పాతుతుండగా పాము కాటు వేయగా అక్కడే ఉన్న భార్య సౌభాగ్యకు చెప్పాడు. ఇంతలోనే అపస్మారకస్థితిలో వెళ్లిపోయాడు. వెంటనే రైతును బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పెళ్లి కాలేదని యువకుడు ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పెళ్లి కాలేదని మనస్థాపానికి గురై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం ధర్మవరంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాలు.. పట్టణంలోని కురుబ వీధికి చెందిన సరోజమ్మ కుమారుడు నరేష్(32) టిటిసి పూర్తి చేసి ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తుండేవాడు. ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం శ్మశానంలో తండ్రి సమాధి వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగి తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆమె బంధువులతో కలిసి అక్కడికి చేరుకోగా అపస్మారకస్థితిలో పడి ఉన్న నరేష్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

బత్తలపల్లి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గొర్రెల చోరీ కేసులో తప్పించుకు తిరుగుతున్న తండ్రీకొడుకులు ముష్టూరు గంగులప్ప, ముష్టూరు హరికృష్ణ(ముదిగుబ్బ మండలం, రోడవండ్లపల్లి గ్రామం)లను అరెస్టు చేయడానికి ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం గాలించింది. ఈ క్రమంలో శనివారం మండల పరిధిలోని ఉప్పరపల్లి క్రాస్ వద్ద వారిని అరెస్టు చేసి పిడి బాకు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు సుదర్శన్‌నాయుడు, పెద్దారెడ్డి, జనార్ధన్‌లను ఎస్ఐ శ్రీనివాసులు, సిఐ ఆరోహణరావు అభినందించారు.

అనారోగ్యంతో విశ్రాంత ప్రిన్సిపల్ మృతి

కదిరి టౌన్ : పట్టణంలోని జడ్జి క్వార్టర్స్ వెనుక నివాసం ఉండే ప్రీమియర్ డయాగ్నస్టిక్స్ నిర్వాహకులు వైసిపి నేత మధుసూదనరెడ్డి తండ్రి రిటైర్డ్ ప్రిన్సిపల్ రామక్రిష్ణారెడ్డి శనివారం అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, ఆయన భార్య డాక్టర్ ఉషారాణి, పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

నేడు 'పురం'లో యుటిఎఫ్ జిల్లా మహాసభలు

మడకశిర: హిందూపురం పట్టణంలో ఆదివారం(నేడు) నిర్వహిస్తున్న యుటి ఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక కెపిఎస్ పాఠశాలలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో జిల్లా స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు అయిన సందర్భంగా జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుడిమండ మండల ప్రధాన కార్యదర్శి టి.మూడ్లగిరియప్ప, కామ్రేడ్స్ నరసింహమూర్తి, సుదర్శన్, మహంతేష్, దేవరాజు, నంజప్ప, కదిరన్న, నరసింహరాజు, సూర్యప్రకాష్, ఉగ్రనరసింహ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల అన్నదానానికి ఎన్ఆర్ఐ విరాళం

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని బూడిదగడ్డపల్లి గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి తనయుడు ఎన్ఆర్ఐ శేషానందరెడ్డి పట్టణంలోని దామరోడ్డులో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులకు శనివారం రూ. 1,00,116ను తల్లి ఓబులమ్మ ద్వారా అందజేశారు. ఈ మొత్తాన్ని అయ్యప్ప మాలధారుల అన్నదాన కార్యక్రమానికి ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో నార్పింపల్లి సర్పంచి లక్ష్మీగంగాధర, భక్తులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

లేపాక్షి : మండల పరిధిలోని కోడిపల్లి పంచాయతీ నాగేపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఉప్పర ఆదినారాయణ కొద్దిరోజులుగా కర్నూలులో ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. దీంతో ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయం నుంచి రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డి, జయకృష్ణారెడ్డి, ఎంపిటిసి గంగాధర్, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మణమూర్తి, కిష్టప్ప, అమర్నాథ్, శంకరప్ప, రామచంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పై ర్యాలీ

చిలమత్తూరు : ఓటరు నమోదుపై శని వారం తహశీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1వ తేదీ లోపు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, బిఎల్ఒలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం

పుట్టపర్తి అర్బన్ : ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని జిల్లా కార్యదర్శి కందు కూరు శివ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల యుటిఎఫ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి కార్యాచరణ రూపొందిం చడానికి నూతన కమిటీలను ఎన్నుకున్నామన్నారు. పుట్టపర్తి మండల కమిటీ అధ్యక్షులుగా బాబావలి, ప్రధాన కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా నారాయణస్వామి మరో నలుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. బుక్క పట్నం మండల అధ్యక్షునిగా శ్రవణ్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, గౌరవాధ్యక్షులుగా రామంజి, కోశాధికారిగా ఓబులేసు మరో నలుగురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ యుటిఎఫ్ నాయకత్వం చేపట్టే పోరాటాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, బాబయ్య, శ్రీనివాసులు, నాగేంద్ర, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టుతీర్పు వచ్చేంత వరకూ కూల్చివేత పనులు ఆపాలి

ధర్మవరం టౌన్ : స్థానిక కదిరి గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమిపూజ చేశారని, అయితే కోర్టులో కేసు నడుస్తోందని తీర్పు వచ్చేంత వరకూ పనులు ఆపించాలని బాధితులు శనివారం ఆర్‌డిఒ రమేష్‌రెడ్డికి విన్నవించారు. వారు మాట్లాడుతూ కేసు కోర్టులో ఉండగా ఇళ్లు కూల్చివేయడం తగదని, ఈ నెల 8వ తేదీ తుది తీర్పు వచ్చేంత వరకూ కూల్చివేతలను ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌డిఒను కలిసిన వారిలో బాధితులు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, తులసీరాం, లక్ష్మీదేవి, నాగప్ప, లక్ష్మీనారాయణ, మనోహర్, నాగరాజు, ఆంజనేయులు, ఆదినారాయణ, నాగార్జున, తదితరులు ఉన్నారు.

ఓటరు పరిశీలనను వేగవంతం చేయండి

గుడిబండ : టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు పరిశీలన కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ పార్టీ శ్రేణులకు సూచించారు. బూత్ నంబర్–70, 71లో శనివారం టిడిపి నాయకులు ఓటరు పరిశీలన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లింగాయత్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్, నాయకులు జాని, నాగరాజు, అజఘర్, నాగేంద్ర, నాగలింగప్ప, శ్రీరామప్ప, గౌస్‌పీరా, బిఎల్ఒలు దేవీబాయ్, సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కులస్తుల అభివృద్ధే సేవా సమితి లక్ష్యం

పుట్టపర్తి క్రైమ్ : రాష్ట్ర కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ పరిధిలోని చింత తోపు సమీపంలో కార్తీక వనభోజనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ కమ్మ కులంలో ఎంతోమంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వారి పిల్లల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని ఉన్నత చదువులు చదివించలేకపోతున్నారన్నారు. అలాంటి వారికి కాకతీయ సేవా సమితి ఆయా జిల్లాల సేవా సమితుల ద్వారా చేయూతనందిస్తుందన్నారు. నిరుపేద జంటలకు ఉచితంగా వివాహాలు చేస్తామన్నారు. ఎన్నో సంక్షేమ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కమ్మవారిపల్లికి చెందిన ఊరువాకిలి సురేష్ నాయుడు పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేయడం అభినందనీయమన్నారు.

వంటగ్యాస్ వినియోగంలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వంటగ్యాస్ వినియోగంలో మహిళలు పొదుపు పాటించడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రాజీవ్ సూచించారు. మండల పరిధిలోని పెడపల్లి గ్రామం ప్రాథమి క పాఠశాల ఆవరణలో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎఒ వెంకటబ్రహ్మం, సిఎస్‌డిటి రమేష్, ఎంపిపి రమణారెడ్డి, ఇఒఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి, సర్పంచి మంగ్లీబాయ్, డాక్టర్ జ్యోష్ణ, అంగ న్వాడీ సూపర్‌వైజర్ భారతి, కొండమరాజు, భాస్కర్‌రెడ్డి, శేషాద్రినాయుడు, మహానంద, రామాంజనేయులు, పాల్గొని పలు విషయాలు తెలిపారు. రాజీవ్ మాట్లాడుతూ ఉజ్వల పథకం ద్వారా ప్రతి మహిళకు ఉచితంగా వంటగ్యాస్ పంపిణీ చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎఒ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్ల వాత్మక మార్పులు తేవడానికి నానో యూరియా, నానో డిఎపి ప్రవేశపెట్టారని, వాటి వినియోగం వల్ల రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నగేష్, రాధ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొ న్నారు.

ఎలక్షన్ ఫీవర్..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఎన్నికలకు సమయం ముంచుకొస్తుండటంతో అప్పుడే అంతటా ఎలక్షన్ ఫీవర్ మొదలైనట్టు కనిపిస్తోంది. అటు నేతలు, ఇటు రాజకీయపార్టీలు, కుల సంఘాల హడావుడి అంతా..ఇంతా ఉండటం లేదు. గత వారంలోనే తెలంగాణ ఎన్నికలు కూడా పూర్తయ్యి నేడు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఎన్నికల ఫలితాలు ఏ రకంగా ఉంటాయి... ఆ ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ఏ రకంగా ఉంటుందన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఇదే నేపథ్యంలో ఇక్కడ కూడా కొన్ని నెలల్లో ఎన్నికలు ఉండే అకవాశముండటంతో అప్పుడే అంతటా రాజకీయ హడావుడి మొదలైంది. ఓటర్ల జాబితాలతోపాటు, ఇవిఎంలను సిద్ధం చేసే పనిలో అధికార యంత్రాంగం ఉంది. అయితే ఓటర్ల జాబితాలో తప్పొప్పులు రాజకీయ వేడి రగులుస్తున్నాయి. అధికార పార్టీ ఒక పథకం ప్రకారం ప్రత్యర్థి ఓట్లను తొలగిస్తూ, అధికార పార్టీకి అనుకూలమైన ఓట్లను చేరుస్తున్నారని ప్రతిపక్ష టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక అధికార పార్టీ కూడా వారే తప్పు చేస్తున్నారంటూ వైసిపి నాయకులు ప్రత్యారోపణలు చేస్తున్నారు. దీనిపై ఒకరిపై ఒకరు మీడియా సమావేశాలు పెట్టి మరీ విమర్శించుకుంటూ పోతున్నారు. ఇంకా ఎన్నికల కోడ్ కూడా రాకముందే ఎన్నికలు వచ్చేసాయన్నంతగా ఈ విమర్శలు, ప్రతి విమర్శలు నడుస్తున్నాయి. ప్రధానంగా ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం, గుంతకల్లు తదితర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా రాజకీయ వేడిని రగులుస్తోంది. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమయత్తమయ్యే పనిలోనూ మరోవైపు నిమగ్నమై ఉన్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వనరులను సిద్ధం చేసుకుని ఎన్నికల రణరంగంలో దిగేందుకు అవసరమైన ప్రయత్నాల్లో నాయకులు తలమునకలై ఉన్నారు. ఇప్పటి నుంచే ఆయా పార్టీల్లో ఎన్నికల సందడి కనిపిస్తోంది. నేతలు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఉంటుందంటే, తమకు అనుకూలమని చెప్పుకుంటున్నారు. అధిష్టానం మెప్పుకోసం ప్రదక్షిణలు మొదలుపెట్టారు. అనుమానం ఉన్న వారు ఏ మార్గంలో పయనిస్తే బాగుంటుందని దారులు వెతుక్కునే పనిలోనూ ఉంటున్నారు. దీని కోసం తమ అనుయాయులతో మంతనాలు, సంప్రదింపులు నడుస్తున్నాయి. ఆదివారం నాడు వెలువడే తెలంగాణ ఎన్నికల ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకుందామన్న ఆలోచనలు చేసుకుంటున్నారు.

కులసంఘాల సమావేశాలు

ఎన్నికల సీజన్ కావడంతో కుల సంఘాల సమావేశాలు ముమ్మరమయ్యాయి. కురుబ, బోయ, వడ్డేర, కాపుబలిజ ఇలా అన్ని కులాలు తమ బలాన్ని ఎన్నికల ముందు ప్రదర్శించే ప్రయత్నాలు చేసుకుంటుయి. ఇదివరకే బోయ, కురుబ కులాలు సభలు నిర్వహించాయి. ఈ వారంలో కాపు సామాజిక వర్గం వనబోజనాల పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తోంది. కుల సంఘాల మద్దతు కూడగట్టి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు సాధించుకోవాలని భావిస్తున్న నేతలు కనిపిస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా అందుకు అతీతంగా కనిపించడం లేదు. ఇప్పటికే వైసిపి సామాజిక చైతన్య యాత్ర పేరుతో బస్సు యాత్రను చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ యాత్రలు ఈ వారంలో మరిన్ని ఎక్కువ పెట్టబోతోంది. టిడిపి బీసీ, ఎస్సీ,మైనార్టీల సదస్సులు నిర్వహిస్తోంది. ఇలా ఎన్నికల హీట్ రోజురోజుకు పెరిగిపోతోంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పీక్‌కు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల ఫీవర్ నేపథ్యంలో నేతల యాత్రలు కూడా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైకుంఠ ఏకాదశిని వైభవంగా నిర్వహిస్తాం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 23వ తేదీ వైకుంఠ ఏకాదశి పండుగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఛైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఇఒ వెంకటేశులు తెలిపారు. వారు శనివారం పాలకవర్గంతో సమావేశం నిర్వహించి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. 23వ తేదీ తెల్లవారుజామున 2 నుంచి రాత్రి 10 గంటల వరకు నిరవధికంగా దైవ దర్శనం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బిఆర్.వెంకటేష్‌లు, మేనేజర్ రామశాస్త్రి, పోరాల పద్మావతిపుల్లయ్య అర్చకులు భాను ప్రకాష్, కోనేరాచార్యులు, మకరంద బాబు, పాలకవర్గం సభ్యులు బండ్లపల్లి రంగనాథ్, జగ్గా బరిణి, అజంతా కృష్ణ, అంబటి శ్రీధర్, సత్రశాల అశ్వత్థనారాయణ, కుండా చౌడయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాశెట్టి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.NO:16/2019 in O.S.NO:35/2017

Between:

Y.శంకరరెడ్డి S/o Y.రంగారెడ్డి, D.No:1-1135-1-D, అడపాల వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...డిక్రీ హోల్డర్

V/S

G.ప్రభాకరరెడ్డి S/o G.చంద్రశేఖరరెడ్డి, డ్రాయింగ్ టీచర్, గవర్నమెంట్ బాలుర జూనియర్ కాలేజి, నివాసం D.No:1-435-8, అడపాల వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.

...జడ్జిమెంట్ డెట్టార్

U/or 21 Rule 64, 66 వేలం నోటీసు J.Dr కు

పై E.P. లో డిక్రీహోల్డర్ తన డిక్రీ బాకీ వసూలుకై జడ్జిమెంట్ డెట్టార్‌కు సంబంధించిన E.P షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము కోరినాడు. వేలము నోటీసు నీ హాజరు నిమిత్తమై 22/12/2023 వ తేదికి వాయిదా వేసినారు. పై కోర్టులో నీవు ఆ రోజు స్వయముగా గానీ వకీలు ద్వారా గానీ, హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలయునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:22/12/2023
స్థలం:కదిరి

బండారు క్రిష్ణమూర్తి , M.A., L.L.B.,
డిక్రీ హోల్డర్ తరుపు వకీలు, కదిరి.